www.prajasakti.com
# ప్రజాశక్తి
శనివారం 27మే 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



## సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ

మాట్లాడుతున్న కమిషనర్

**ప్రజాశక్తి-నెల్లూరు**: నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 18/1, 18/2 హరనాథపురం, పీపుల్స్ పార్క్ సమీపంలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్‌స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిస్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు సూచించారు. ఎస్.ఈ.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని తెలిపారు. అదేవిధంగా ఆస్థి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఈ.ఈ శేషగిరిరావు, ఏ.ఈ ఫాజిల్, సచివాల యాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# కావలిలో 'బిజినెస్'మెన్స్ గురి..!

◆టిడిపి, బిజెపి, జనసేన నుంచి ఆసక్తి
◆వైసిపిలో ఉత్కంఠ

**కావలి రాజకీయం ఆసక్తిగా మారింది. 2024 ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. టిడిపి, బిజెపి, జనసేన తరపున పోటీ చేయడానికి కొందరు అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. ఉన్నత స్థాయిలో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. టిడిపి నుంచి జలదంకి మాజీ ఎంపిపి కావ్య కృష్ణారెడ్డి పేరు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. బిజెపి తరపున పసుపులేటి సుధాకర్ ప్రయత్నాలు చేస్తుండగా, జనసేన తరపున ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గిలకా నరేంద్ర యాదవ్ పేరు వినిపిస్తోంది. అధికార వైసిపి తరపున సిట్టింగ్ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆసక్తి ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పొత్తులు, ఎత్తులు తరువాత ఎవరు రంగంలో ఉంటారోనని ఆసక్తి అందరిలో కనిపిస్తోంది.**


కావ్య కృష్ణారెడ్డి (ఫైల్ ఫొటో)

గిలకా నరేంద్ర యాదవ్ (ఫైల్‌ఫొటో)

పసుపులేటి సుధాకర్ (ఫైల్ ఫొటో)

కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

2024 ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు, అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల వేట సాగుతోంది. ఈసారైనా తమ భవిష్యత్తును చూసు కోడానికి అందరూ సిద్ధమవుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉండి, అవకాశాలు రాని వ్యక్తులు ఎలాగైనా ఏదోపార్టీ తర పున పోటీచేయాలని ఆసక్తి చూపు తున్నట్లు కనిపిస్తోంది. మరో వైపు పొత్తుల విషయం తెలియక పోవడంతో ఒక్కో రాజకీయ పార్టీ నుంచి అభ్యర్థులుగా తామంటే తామం టున్నారు. టిడిపి కావలిలో నూతన అభ్యర్థి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎం.సుబ్బానాయుడు ఇన్ ఛార్జ్‌గా కొనసాగుతున్నారు. ఇక్కడ టిడిపి నుంచి ప్రముఖ వ్యాపారవేత్త కావ్య కృష్ణారెడ్డి ఈ దఫా టిడిపి టికెట్ కోసం గట్టిగా ప్రయ త్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆయన జలదంకి ఎంపిపిగా పనిచేశారు. అప్పటి నుంచి టిడిపి, వైసిపి ఏదొక పార్టీ నుంచి పోటీచేసి, ఎంఎల్ఎ కావాలనే కోరిక బలంగా ఉన్న ఆయన ఈ దఫా టిడిపి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తనకు టికెట్ ఇస్తే ఎన్నికల్లో భారీగా ఖర్చు పెట్టుకుంటానని, పార్టీకి నిధులు ఇస్తానని, చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. అధిష్టానం పెద్దలతో ఆయన టచ్‌లో ఉంటూ, తన పని తాను చేసుకుపోతున్నారని తెలుస్తోంది. మరో వైపు టిడిపి, జనసేన పొత్తు ఉంటుందని తెలుస్తోంది. ఇదే జరిగితే జనసేన నుంచి పోటీ చేయడానికి మరో రియల్ ఎస్టేట్ వ్యాపారి సిద్ధపడు తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానిగా, గతంలో ప్రజా రాజ్యం టికెట్ కోసం ప్రయత్నాలు చేసినా గిలకా నరేంద్ర యాదవ్ ఈ సారి కావలి నుంచి జనసేన తరపున పోటీకి ఆసక్తిచూ పుతున్నట్లు సమాచారం. బిజెపి తరపున ప్రముఖ వ్యాపారి పసుపులేటి సుధాకర్ పేరు ఉంది.ఆయన గతంలో కావలిలో పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు తాను పోటీకి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన, బిజెపి నుంచి ముగ్గురు వ్యక్తుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇదే పార్టీల మధ్య రాజకీయ పొత్తు ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఇక్కడ నుంచి ఎవరు పోటీ చేయాలన్నా టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్ సపోర్టు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం టిడిపి రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తు న్నట్లు సమాచారం. మద్దతు ఉంటే ఒక్కరికి లేదంటూ అందరూ పోటీలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక అధికారపార్టీ నుంచి ప్రస్తుత ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప కుమార్‌రెడ్డి పేరు వినిపిస్తుండగా, మాజీ ఎంఎల్ కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పోటీకి ఆసక్తిగ ఉన్నారు. ఇటీవల విష్ణు శంఖా రావం పేరుతో నియోజక వర్గంలో కలియ తిరిగారు. చివరి ఎన్నికలంటూ అందరి వద్ద ప్రస్తావి స్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు న్నాయనే ప్రచారం సాగుతోంది. అధికారపార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేయడం లేదం టూ మరేదైనా పార్టీ నుంచి పోటీకి చేస్తారా అనే ప్రచారం సాగుతోంది. 2024 ఎన్నికల్లో కావలి నియోజ వర్గంలో రాజకీయ పార్టీలకు అసలు అభ్యర్థే దొరకరని ప్రచారం సాగుతు ండగా, వ్యాపార వేత్తలు ఇక్కడ నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయాల్లో ఎప్పుడు ఏదైనా సాధ్యమే. ఏం జరుగుతుందో చూడాలి.

### కేన్సర్ ఆస్పత్రిలో కలెక్టర్ సందర్శన

**నెల్లూరు** :కేన్సర్ వ్యాధితో బాధప డుతూ రెడ్ క్రాస్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి సేవలు అందిం చాలని కలెక్టర్ హరి నారాయణ అధికారులకు సూచిం చారు. నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కేన్సర్ ఆసుపత్రిని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ శుక్రవారం సందర్శించారు. మొదటి సారిగా ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్ కు సర్జికల్ ఆంకాలజిస్ట్ నాగేశ్వర రావు, సీనియర్ రేడియేషన్ తెరపిస్ట్ గీతా ఉషశ్రీ, వైస్ చైర్మన్ సుధీర్ నాయుడు, మేనేజర్ జుబేర్ కలెక్టర్ కు స్వాగతం పలికారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అదాని ఫౌండేషన్ కృషి

**ప్రజాశక్తి-ముత్తుకూరు**: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అదాని ఫౌండేషన్ కృషి చేస్తుందని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం ముత్తుకూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలోని అదాని చికిత్సాలయంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో అపోలో ఆస్పత్రిలో అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు .పోర్టు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అదాని కష్ణపట్నం పోర్ట్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మందికి బిపి, షుగర్,జనరల్ హెల్త్ చెకప్‌తో పాటు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో ముత్తుకూరు ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ ఎస్ అనూష, వెంకటాచలం ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డాక్టర్ బాల పద్మ, అపోలో హాస్పిటల్ డాక్టర్ గాయత్రి, అదాని ఫౌండేషన్ డాక్టర్ సుహర్షన్, అదాని ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్, రామానంద్ యాదవ్, రమేష్ బాబు, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్సపొందుతూ గీత కార్మికుడు మృతి

**ప్రజాశక్తి-వెంకటాచలం**

కల్లు గీత కార్మికుడు పాము కాటు గురై చికిత్స పొందుతూ మతి చెందాడు. ఈసంఘటన మండలంలోని అనికేపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. అనికేపల్లి గ్రామానికి చెందిన కోసూరు అంకయ్య (51)తాటి చెట్లకు కల్లు గీసి కల్లు అమ్ముకొని తన భార్య సుభాషిణి, కొడుకులు చెన్నయ్య,అశోక్ లను పోషిస్తున్నాడు.ప్రతి రోజూ ఈనెల 19వతేదీ తెల్లవారుజామున తాటి చెట్ల వద్దకు కల్లు కుండలు తీసుకొని వచ్చేందుకు వెళ్లాడు. చెట్టు మొద ళ్ళులో ఉన్న రక్త పెంజీరి పాము కాటేసింది.మృతుడు ఇంటికి వచ్చి కుటుంబసభ్యులకు చెప్పాడు. వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకొని వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెం దాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

# జెన్కో గేటు ఎదుట బహిరంగ సభ

**ప్రజాశక్తి-ముత్తుకూరు**: ఈనెల 30వ తేదీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని నేలటూరు జెన్కో గేటు ఎదుట ఉదయం 9గంటలకు బహిరంగ సభ జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ముత్తుకూరు శ్రామిక భవన్లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. తొలుత బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 30వ తేదీన మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ ఏపీ జెన్కోలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్ రావు హాజరవుతారని తెలిపారు. మండలంలో పోర్టు కార్మికుల పోరాటం ట్రాన్స్‌పోర్టు కార్మికుల పోరాటం, ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రయివేటు కరణ వ్యతిరేక పోరాటం, సిఐటియు నాయకత్వంలో విజయవంతమయ్యాయని తెలిపారు ఈ బహిరంగ సభకి ఉపన్యాసకులుగా జెన్కో పోరాట కమిటీ కన్వీనర్ ఎం. మోహన్ రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి సూరిబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రామయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుమన్, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, చేవూరు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

# త్వరితగతిన గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి

**ప్రజాశక్తి-నెల్లూరు**: నగరంలో నిర్మాణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని రేబాల వారి వీధి ప్రాంతంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం ఆవరణలో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ కు వివరించారు. ఇప్పుడున్న గ్రంథాలయ భవనం చాలా పురాతనమైనది కావడం, వర్షాకా లంలో ఉరుస్తుండడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు., నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. అనేక చోట్ల ఖాళీగా ఉన్న పాఠశాల భవనాలను గ్రంథాలయ సంస్థకు ఇప్పిస్తే, అక్కడ గ్రంథా లయం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేయించేలా చర్యలు చేపడతామని, రోడ్డు విస్తరణలో కోల్పోయిన గ్రంథాలయ భవన నిర్మాణా లకు నష్టపరిహారం ఇప్పిస్తామని స్పష్టం చేశారు. భవన నిర్మాణ విషయమై నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ తో కూడా కలెక్టర్ చర్చించారు. అనంతరం గ్రంథాలయంలో చిన్నారులకు ప్రత్యే కంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. కలెక్టర్ వెంట గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, ఏపీఈడబ్ల్యూఐడిసి ఈఈ హనుమంతరావు, డిఈ సుబ్బరాయులు, గ్రంథాలయ సంస్థ సిబ్బంది ఉన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్, చైర్మన్

## అక్రమ బదిలీలు ఆపాలి

**ప్రజాశక్తి-కందుకూరు**: స్థానిక డిపోలో ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రెండవ రోజు ఉపాధ్యక్షులు మాల కొండయ్య అధ్యక్షతన నిరసన కార్యక్రమం జరిగింది. నిరసనను ఉద్దేశించి ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాజీ కార్యదర్శి ఎఎస్ రావు మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంత్ పేరుతో అక్రమ బదిలీలను ఆపాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఈహెచ్ఎస్ కార్డు స్థానంలో ఆర్టీసీ వైద్యాన్ని పునరుద్ధరిం చాలని, అద్దె బస్సుల స్థానంలో సంస్థ కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి గాజులవర్తి సురేష్ మాట్లాడుతూ ఆన్ కాల్ డ్రైవర్ విధానానికి స్వస్తి పలికి వారి స్థానంలో రెగ్యులర్ పద్ధతిలో నియామకాలు చేపట్టాలని, సిబ్బందిపై పని భారం తగ్గించాలని, అప్పీల్స్ ను పరిష్కరించాలని, దశలవారీగా అద్దె బస్సులను నియంత్రించాలని, డిపోలో పెండింగ్‌లో ఉన్నసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ సహాయ కార్యదర్శి గౌస్ మాట్లాడుతూ సమస్యలను అన్ని అసోసియేషన్లతో చర్చించి పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో కెఎస్‌రావు, జబీర్ బాషా, షేక్ రఫీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

## 'మట్టి' అక్రమ తరలింపును అడ్డుకున్న ప్రజలు

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం** :మండలంలోని చుండి పెద్ద చెరువులోని మట్టిని ఇటుక బట్టీల నిర్వాహకులు అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం చుండి, అయ్యవారిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు అడ్డుకున్నారు. చెరువులో మట్టి తరలించేందుకు వీలులేదని తెగేసి చెప్పారు. అదే సమయంలో చుండి గ్రామసర్పంచ్ ఇరపని సతీష్ ఇరిగేషన్ అధికారులతో పాటు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సైతం అక్కడకు వచ్చారు. అనంతరం ఏం జరిగిందో తెలియదు కానీ తిరిగి యథావిధిగా మట్టిని తరలించుకు పోయారు. మూడు జెసిబిలతో సుమారు 30 ట్రాక్టర్లతో మట్టిని తోడేస్తున్నారు. ముందుగా వివాదం జరుగుతున్న సమయంలో పోలీసులు సైతం ట్రాక్టర్లను నిలిపివేశారు. అనంతరం అధికారులతో మాట్లాడి అనుమతులు ఉన్నట్లు తెలుసుకొని వదిలేసినట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు. ఇరిగేషన్ ఎఇని సంప్రదించాలని ప్రయత్నించినా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. డిఇ చెరియన్‌ను వివరణ కోరగా, చెరువులో మట్టి తరలింపునకు సంబంధించి 500 క్యూబిక్‌మీటర్లు తీసేందుకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన నగదును ప్రభుత్వానికి జమ చేసినట్లు వివరించారు. మట్టి అనుమతికి మించి భారీగా తరలించేందుకు సిద్ధం చేసినట్లు తెలిసింది. అదేవిధంగా వలేటివారిపాలెం రామన్నచెరువులోనూ గుర్తు తెలియని వ్యక్తులు మట్టిని తరలించుకుపోతున్నారని, నిఘా ఉంచాలని పోలీసులకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై కూడా విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మట్టికి సంబంధించి వలేటివారిపాలెం మండలంలో పెద్ద వివాదం జరుగుతూనే ఉన్నప్పటికీ, అధికారులు అనుమతులు ఇచ్చామనే పేరుతో అక్రమాలపై నిఘా ఉంచకపోవడం, చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

అడ్డుకుంటున్న ప్రజలు

## తహశీల్దార్ బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

మండల తహశీల్దార్‌గా హమీద్ శుక్రవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. గత మూడు నెలల క్రితం ఈ కార్యాలయంలో తహశీల్దార్ పోస్టు ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహశీల్దార్ శివయ్యకు ఉన్నతాధికారులు ఎఫ్ఏసి బాధ్యతలు అప్పగించారు. హమీద్ తహశీల్దార్ గా విధుల్లో చేరడంతో శివయ్య డిప్యూటీ తహశీల్దార్‌గా కొనసాగనున్నారు. హమీద్ కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేదలకు గొడుగులు పంపిణీ

**ప్రజాశక్తి-కందుకూరు**: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పువ్వాడి వెంకటేశ్వర్లు, సుమలత దంపతుల సహకారంతో పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే యాచకులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. తోట కోటేశ్వరరావు, చీదెళ్ళ రమణమ్మ సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఎండ వేడిమికి ఇబ్బంది పడుతున్న యాచకులకు, మధ్యాహ్నం గొడుగులు, వాటర్ బాటిల్స్ అందచేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ వేసవి కాలంలో యాచకులకు గొడుగులు, వాటర్ బాటిళ్ల అందజేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. గొడుగులు వేసవి కాలంలో తోపాటు వర్షా కాలంలో ఉపయోగ పడతాయన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ పేదలకు ఎండలోనే ఆహారం అందిస్తున్న శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యు చేస్తున్న సేవలు ఎనలేనిదన్నారు. నిస్వార్ధంగా సేవలు చేసేవారికి దాతల సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, సెక్రటరీ పబ్బిశెట్టి వెంకట సురేష్, చీదెళ్ల కష్ణ, మణికంఠ పాల్గొన్నారు.

గొడుగులు అందజేస్తున్న దాతలు

## గ్రంథాలయానికి గ్రహణం

**ప్రజాశక్తి-కందుకూరు**: పట్టణంలోని గ్రంథాలయానికి గ్రహణం పట్టిదని కందుకూరు నిరుద్యోగ సంఘ అధ్యక్షులు పగడాల రోశయ్య, ఉపాధ్యక్షులు ఎస్‌కె.ఖాదర్‌బాషా తెలిపారు. జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన కందుకూరు డివిజన్ గ్రంథాలయానికి గ్రహణం పట్టి ఎవరూ పట్టించుకోని విధంగా తయారైందన్నారు.. గ్రంథాల యానికి శాశ్వత గ్రంథపాలకుడు లేక నిరుద్యోగులు, చిరుద్యోగులు ఎంతో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం గ్రూపు వన్, గ్రూప్2, డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేటు వంటి నిరుద్యోగులు ఎంతగానో ఆవేదన చెందుతున్నారు. దయచేసి పై అధికారులు చొరవ తీసుకొని గ్రంథాలయాన్ని తెరిపించాలని కోరారు. గ్రంథపాలకుడు లేకపోవడం వల్ల గ్రంథాలయం తలుపులు తెరుచుకోవడం లేదని తెలిపారు. దీంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

మూతపడిన గ్రంథాలయం

## వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్

**ప్రజాశక్తి-నెల్లూరు**: నగరంలోని పొదలకూరు రోడ్డు గౌతమ్ నగర్‌లో గల హరిత వృ ద్ధాశ్రమాన్ని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ సందర్శించారు. వద్ధాశ్రమంలో ఉన్న వద్ధుల యోగక్షేమాలు, వారికి అందిస్తున్న సేవలను ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆశ్రమ నిర్వహణకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని, దాతలు ఎవరైనా సాయం చేస్తున్నారా అని నిర్వాహకురాలిని అడిగారు. ఆశ్రమంలో 25 మంది వద్ధులు ఆశ్రయం పొందుతున్నారని, వీరికి నాణ్యమైన ఆహారం, మందులు అందిస్తున్నామని ఆశ్రమ నిర్వాహకురాలు కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంట విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి అక్బర్ అలీ ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

కూల్ డ్రింక్స్ అందజేస్తున్న దృశ్యం

## వేసవి శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి-ఉలవపాడు**: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా శుక్రవారం మొత్తం 45 మంది విద్యార్థులు పాల్గొ న్నారు. వీరితో ముందుగా పుస్తక పఠనం చేపించి అనంతరం ఇంగ్లీష్ డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు ఆదివారం ప్రముఖులు బహుమతులు అందజేస్తారు. దాత ఊటుకూరి శ్రీను, ఉలవపాడు స్టేషన్ మాస్టర్ ఎండల్లో పిల్లల ఉత్సాహాన్ని చూసి కూల్ డ్రింక్స్ అందించారు. వారికి పిల్లలూ, గ్రంథపాలకుడు డి కోటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

సన్మానిస్తున్న దృశ్యం

## వలంటీర్లకు సన్మానం

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం** :గ్రామాల్లో ప్రజలకు సేవ చేయడం ఎంతో అదృష్టమని ఎంపిడిఓ షేక్ రఫీక్‌అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని కొండసముద్రం గ్రామ సచివాలయం పరిధిలోని వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆ గ్రామ సర్పంచ్ మన్నం వెంగమ్మ, వైసిపి నాయకులు మన్నం వెంకట రమేష్, ఉపసర్పంచ్ కొల్లి వెంకట నరశింహం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వాలంటీర్లను సన్మానిస్తున్నట్లు చెప్పారు. ఇంకా బాధ్యతగా పని చేసి, ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొ న్నారు. అదేవిధంగా పోలినేనిపాలెం సచివాలయం లోనూ సర్పంచ్ అనుమోలు అమరేశ్వరి, ఎంపి టిసి చింతలపూడి రవీంద్ర, పంచా యతి కార్యదర్శి వెంకటేశ్వర్లు వాలంటీర్లను సన్మానించారు.

# రైతాంగ సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించాలి

### -ఎంపి ఆదాలకు ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి

**ప్రజాశక్తి-నెల్లూరు**

భారత రైతాంగ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సహకారం అందజేయాలంటూ ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. శుక్రవారం నగరంలోని ఎంపి కార్యాలయంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు కలిశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అంటూ కేంద్ర బి.జె.పి ప్రభుత్వం అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ 2020 నవంబరు 26 నుండి 383 రోజులు ఢిల్లీ పరిసరాలలోనూ, దేశవ్యాపితంగానూ రైతాంగం పోరాటం సాగించిన విషయం ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం చట్టాలను వెనక్కు తీసుకుంటూ ఉద్యమం విరమించమని కోరిందని, ఈ సమయంలో రైతాంగం కోరుతున్న 5 అంశాలను పరిష్కరిస్తామని వ్రాత పూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చి ఏడాదిన్నర గడిచినా వాటి అమలుకు పూనుకొనకపోగా రద్దు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. కేంద్రం రైతాంగం యెడల మోసపూరితంగా వ్యవహరిస్తుందని, ఈ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా మరో దీర్ఘకాలిక పోరాటానికి సమాయత్తం అవుతుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ పోరాటంలో మన పార్లమెంటు పరిధిలో ఉన్న మొత్తం రైతాంగం ప్రతినిధిగా మీరు రైతులకు మద్దతు ప్రకటించాలని కోరారు. రైతాంగం కోరుతున్న సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటులో కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరారు. రైతులు నిర్వహించనున్న పోరాటంలో మీరు కూడా ప్రత్యక్ష భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము. డాక్టర్ స్వామినాథన్ సూచనల మేరకు రైతులు సాగుబడిచేసే అన్ని పంటలకు అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం అమలులోకి తీసుకురావాలన్నారు. రైతుల ప్రయివేటు రుణాలను మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం అమలులోకి తీసుకురావాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఉపసంహరించి వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసే ఆలోచన విరమించుకొనేలా కేంద్రంపై వత్తిడి తీసుకురావాలన్నారు. 60 ఏళ్ల వయస్సు దాటిన రైతులకు, కౌలు రైతులకు నెలకు రూ.6 వేలు పెన్షన్ అందజేయాలన్నారు. రైతు ఉద్యమం సందర్భంగా రైతులపై పెట్టిన కేసులు అన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం సందర్భంగా చనిపోయిన రైతుల కుటుంబాలకు కేంద్రం నష్టపరిహారం అందజేయాలని , లఖింపూర్ ఖేరీ హత్యాకాండకు బాధ్యుడైన అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పులిగండ్ల శ్రీరాములు, మూలి వెంగయ్య, ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, నాయకులు గండవరపు శ్రీనివాసులు, గరికపాటి సురేష్, కనుపూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి ఆదాలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# కార్మిక, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

**ప్రజాశక్తి-నెల్లూరు**: ఆర్‌టిసిలో పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం నగరంలోని ఆర్‌టిసి డిపో ఎదుట కార్మికులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఇహెచ్ఎస్ స్థానంలో ఆర్‌టిసి సిబ్బందికి వైద్యసేవలం దించాల న్నారు. 2019 నాటి సర్క్యులర్ ప్రమాణాలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. నూతన బస్సులు కొనుగోలు చేయాలని, సంస్థలో కాల్ ఆన్ డ్రైవర్ విధానాన్ని నిలిపి ఖాళీలను భర్తీ చేసేందుకు డ్రైవర్, కండక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఆర్‌టిసిలో వాడుతున్న డీజల్‌పై వ్యాట్ ట్యాక్స్‌ను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి గ్యారేజ్‌లకు అవసరమైన ఆధునిక పరికరాలు, టూల్స్ ప్రభుత్వం తక్షణమే సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం, నెల్లూరు 1,2 డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు యు. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల రాజశేఖర్, ఎస్. జయరామయ్య, కె. చంద్రయ్య, కె. మౌలా సాహెబ్ కార్మికులు తదితర సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ

**ప్రజాశక్తి-ఉదయగిరి :** జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు. శుక్రవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని అటవీ శాఖ సిబ్బంది విఎస్ఎస్ చైర్మన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. వృక్షాలను అడవిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలో సంచరించరాదని అక్రమంగా అడవి కలపను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించి అటవీశాఖపై చర్యలు తప్పవన్నారు. వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జామాయిల్ చెట్టు కోతకు రావడంతో ఆన్లైన్లో వేలం నిర్వహించామని 3460 ఆన్లైన్లో టెండర్ వేశామన్నారు. ముందుగా అటవీశాఖ సిబ్బంది విఎస్ఎస్ చైర్మన్లతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.కావలి సబ్ డిఎఫ్ఒ పి.రాజశేఖర్ బాబు, రేంజ్ అధికారి పి.ఉమామహేశ్వర్ రెడ్డి, ఎన్జిఒ అధ్యక్షులు రమణయ్య, దత్తల రాణి కృష్ణ పల్లి సెక్షన్, బీట్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్పై అవగాహన

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :** ప్రతి గ్రామానికి మంచినీరు అందించాలని లక్ష్యంతో జలజీవన్ మిషన్ ఏర్పాటు చేశామని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో జలజీవన్ మిషన్పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గృహానికి మంచినీరు అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ ఏర్పాటు చేశారని ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ వి.నాయొమి, జేజేయం నిర్వాహకులు శర్మ, అందరు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## డిఇపై లస్కర్ దౌర్జన్యం

**ప్రజాశక్తి-ఉదయగిరి :** మండల పరిధిలోని గండిపాలెం జలాశయం పరిశీలనకు వెళ్లిన నీటిపారుదల శాఖ డిఇపై జలాశయ పరిధిలో లస్కర్గా విధులు నిర్వహిస్తున్న భాషా శుక్రవారం డిఇ సాయి శంకర్ నారాయణ దౌర్జన్యం చేశారని సబ్ ఇన్స్పెక్టర్ గిరిబాబుకు డిఇ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా మద్యం సేవించి దౌర్జన్యం చేశారని తమ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్కు నానా దూర్భాషలాడుతూ తన కారుకు అడ్డం వచ్చి బూతులు తిడుతూ కారు తాళాలు లాక్కున్నాడని అంతేకాకుండా ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ని విధులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించారని ఫిర్యాదులో డిఇ పేర్కొన్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిఇ ఫిర్యాదులో కోరారు.

## అన్నదాతకు సన్మానం

**ప్రజాశక్తి-కావలి :** కావలి పట్టణం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సుమారు 300 రోజుల నుంచి పేదలకు రోజు వందమంది రోగులకు భక్తులకు అన్నదానం చేస్తున్న సిద్ధా రాజేంద్ర నాయకుల కన్నా గొప్పవాడని దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అన్నదానం మొదలుపెట్టి 300 రోజులైన సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు మల్లి సిద్ధును శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మోహన్, జరుగుమల్లి విజయరత్నం, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రై సైకిల్ పంపిణీ

**ప్రజాశక్తి-కొడవలూరు :** మండలంలోని రేగడిచెలిక గండవరంకు చెందిన వికలాంగుల వలంటీర్లు శ్రీధర్, అంజమ్మలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. నార్త్రాజుపాలెంలోని విపిఆర్ అతిథి గృహ ప్రాంగణంలో శుక్రవారం వలంటీర్లకు పురస్కారం ప్రదానం చేశారు. వైసిపి కార్యాలయంలో డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్రెడ్డి, నల్లపల శ్రీనివాసులు, దేవనబోయిన శివకుమార్, అక్కుల్ రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ను కించపరిస్తే ఊరుకోం..

**ప్రజాశక్తి-కావలి :** కావలి బ్రిడ్జి సెంటర్లో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వేయించిన ఫ్లెక్సీలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ను కించపరిచే విధంగా ఉన్నందున వల్ల కార్యకర్తలు, అభిమానులు మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని జనసేన నాయకులు తప్పుబట్టారు. జనసేన నాయకులు రిశికేష్, సుధీర్ ఆధ్వర్యంలో శుక్రవారం డిఎస్పి వెంకటరమణకు మున్సిపల్ కమిషనర్కు కలిసి ఆ ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో మస్తాన్, ఆలా శ్రీనాథ్, శ్రీను, చంటి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో స్పందించిన వైద్యబృందం

**ప్రజాశక్తి-నెల్లూరు :** నగరంలోని మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం సకాలంలో స్పందించడం వల్ల రక్తపరుగు నిలిపివేసి అపస్మారక స్థితిలో ఉన్న హుజూరత్య అనే బాలికకు ప్రాణాలను కాపాడగలిగామని ఆ వైద్యశాల న్యూరాలజిస్ట్ డాక్టర్ వైష్ణవి పేర్కొన్నారు. శుక్రవారం మెడికవర్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మెడికవర్ హాస్పిటల్స్ డైరెక్టర్ అరవింద్, ఇండియా మెడికవర్ చిత్తూరు, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-నెల్లూరు :** బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శుక్రవారం ఎనెల్ హాస్పిటల్, సి.పి అండ్ పి.హెచ్.పి.డబ్ల్యు.ఎ (పిఎంవి అసోసియేషన్) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషు స్కూల్ వ్యవస్థాపకులు బోగాలచక్రం ఉమ్మడి, డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ మన జీవన విధానంలో ఆహారపు అలవాట్లు మారడం వల్ల రకరకాల వ్యాధులు ప్రబలుతున్నాయని, ముఖ్యంగా కీళ్ళు, ఎముకలు అరుగుదల వల్ల దైనందిన జీవితం చాలా కష్టంగా ఉంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఎస్ మహబూబ్ బాషా, పిఎంవి జిల్లా అధ్యక్షులు శాలవర్య వేణుగోపాల్, డివిజన్ కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసులు, పిఎంవిలు నాగరాజు, మధుసూదన్, హాస్పిటల్ పిఆర్ఓ సునీల్, ప్రశాంత్, స్టాఫ్ మైన, స్వాతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిములకు సీట్లు కేటాయించాలి

**ప్రజాశక్తి-నెల్లూరు :** రానున్న 2024 ఎన్నికల్లో దామాషా ప్రకారం ముస్లిములకు సీట్లు కేటాయించాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అజాద్ సెంటర్లోని ఇన్సాఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు దేశవ్యాప్తంగా అదేవిధంగా మన రాష్ట్రంలో రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, అన్నిరంగాల్లో వెనుకబడ్డారన్నారు. 2024లో అసెంబ్లీలో 25 మంది ముస్లిములకు ఎంఎల్ఎ స్థానాలకు పోటీ చేసే 5 ఎంపి స్థానాలకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ దామాషా ప్రకారం ముస్లింలకు ఏ పార్టీ సీట్లు కేటాయిస్తారో వారికే మా సంపూర్ణ మద్దతు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, షాజహాన్, ఖలీల్, బాబు పాల్గొన్నారు.

## అనుమతి మేరకే మట్టి తవ్వకం

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం :** మండలంలోని పోకూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని మైనర్ ఇరిగేషన్ చెరువు నుండి జాతీయ రహదారి పనుల నిమిత్తం వల్లభనేని కంపెనీ వారు మట్టి తవ్వకానికి సంబంధించి అనుమతులు తీసుకున్నారని ఇరిగేషన్ శాఖ ఒంగోలు పర్యవేక్షక ఇంజనీర్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ బాధ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పోకూరు చెరువును పరిశీలించి, మట్టి భారీగా తరలించారని, పెద్దపెద్ద గుంతలు ఏర్పడటం వలన చెరువు కింద సాగు చేసే దిగువున ఉన్న మట్టి తీయడంతో ఆయకట్టు రైతులు ఇబ్బంది పడతారని ఇటీవల ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన స్పందించారు. తాను సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకే మట్టికి అనుమతులు తీసుకొని చేసినట్లు చెప్పారు. సీనరేజ్ ఛార్జీలు చెల్లించినట్లు వివరించారు. తాము కంటే దిగువకు మట్టి తవ్వకాలు జరిపితే, గతంలో నీటి-దొడ్డి చెరువులో ఉన్న పల్లం ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు సంబంధించి ఇదే ప్రాంతంలో మట్టి తరలించడం జరిగిందన్నారు. నిబంధనల మేరకే మట్టి తరలిస్తున్నట్లు లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు.

## పైప్లైన్కు మరమ్మతులు

**ప్రజాశక్తి-అల్లూరు :** మండల కేంద్రం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వద్ద పైప్లైన్లు దెబ్బతినడం కారణంగా శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ ఫజలువుర్ వెంటనే స్పందించి పైప్లైన్కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలో సిమెంట్ రోడ్డు కింద పైప్లైన్ ఉన్న కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలియజేశారు. సమస్య అధిగమించుకొని సత్వరమే చర్యలు చేపట్టామని వివరించారు.

# రిలే నిరాహార దీక్ష విజయవంతం

**ప్రజాశక్తి-కావలి**

మాట్లాడుతున్న జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వై.వి.రమణా రెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు కావలి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట శుక్రవారం నిర్వహించిన ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష శిబిరంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, కంటిన్జెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేశారు. మే 22న నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రోజుకొక తాలూకా కేంద్రంలో రిలే నిరాహార దీక్ష శిబిరాలు నిర్వహించడం జరపాలన్న రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం కావలి తాలూకాలో రిలే నివాహాల దీక్షా శిబిరం నిర్వహించారు. ఈ నిరాహార దీక్ష శిబిరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై.వి.రమణా రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అలాగే ప్రతినెలా 1వ తేదీన జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నవంబర్ 25, 1993 కంటే ముందు నియమితులైన ఎన్ఎంఆర్, డైలీ వేజెస్, కంటెంజెంట్ ఉద్యోగులందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే 11వ పిఆర్సి అమలులో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో భాగంగా ఆర్థిక పరమైన బకాయిలు డిఎ అరియర్స్ను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ సంఘాలతో నేరుగా సంప్రదింపులు జరిపి 12వ పిఆర్సి వేతన సవరణను గావించాలని, ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్, ఎపిజిఎల్ఐకు భద్రత కల్పించాలన్నారు. పదవీ విరమణ గావించిన ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజున అన్ని ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ను సమావేశపరిచి సమస్యలు చర్చించి పరిష్కరించాలన్నారు. ఈ రిలే నిరాహార దీక్షకు కావలిలోని అన్ని శాఖల ఉద్యోగులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం పాల్గొని జయప్రదం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు వై.రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జె.సుజాత బాయి, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యులు డాక్టర్ చెర్లో రమణారెడ్డి

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్**

డాక్టర్ చెర్లో రమణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిరంతరం పేద ప్రజల కోసం వైద్య సేవలు అందించిన డాక్టర్ చెర్లో రమణారెడ్డి అని డాక్టర్ ఎం వి రమణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో డాక్టర్ చెర్లో రమణారెడ్డి 24 వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత చెర్లో రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ డాక్టర్ చెర్లో రమణారెడ్డి ఆత్మకూరు నివాసి ఆత్మకూరులో మొట్టమొదటిసారిగా మెడిసిన్ చదివిన ఏకైక వ్యక్తి ఆయన మెడిసిన్ పూర్తి చేసుకొని పేదల కోసం వైద్యం అందించాలని సంకల్పంతో నెల్లూరు జిల్లాలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్లో తక్కువ జీతానికి పనిచేస్తూ పేదలకు వైద్యం అందించారని కొనియాడారు. అంతే కాకుండా 1965లో జిల్లాలో కలరా సోకడంతో ఎంతోమందికి వైద్యం చేసి ప్రాణాలు కాపాడారు ఆత్మకూరులో భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పార్టీకి అన్ని విధాలుగా సహకరిస్తూ పార్టీ బలోపేతానికి ఆర్థిక సహాయం అందజేసే వారు ఆయన చొరవతోనే ఆత్మకూరులో సిపిఎం కార్యాలయాన్ని నిర్మించారన్నారు. ఆయన జీవితం పార్టీ కోసమే పేద ప్రజల కోసం పనిచేశారని తెలిపారు. అనంతరం డాక్టర్ రామచంద్ర రెడ్డి హాస్పిటల్ వైద్యులు ఎంవి రమణయ్య ఆధ్వర్యంలో గుండె వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జివి శివప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంట లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎం నాగేంద్ర, చెర్లో సుబ్బరామిరెడ్డి, షేక్ గుల్జార్ బేగం, మహబూబ్ బాషా, డివైఎఫ్ఐ నాయకులు నందా శీను, గద్దర్ బాబు, కొండ లక్ష్మమ్మ, ఎస్.పద్మ, వి.పద్మ, సుమతి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలోని సింగనపల్లిలో వాటర్ప్లాంట్ మరమ్మతులకు గురైందని ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా మంచినీటి సమస్య పరిష్కారానికి ఆయన సొంత నిధులు రూ.50వేలు అందజేశారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి నిర్వహించారు. గ్రామస్తులు గ్రామంలో మంచినీటికి అవస్థలు పడుతున్నామని, వాటర్ ప్లాంట్ను పునరుద్ధరణ చేస్తే తమకు మంచినీటి సమస్య పరిష్కారమవుతుందని ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన గ్రామస్తుల మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు శుక్రవారం స్వగృహం బ్రాహ్మణపల్లిలోని తమ నివాసంలో సింగనపల్లి గ్రామస్తులకు తమ స్వంత నిధులు రూ.50వేల చెక్కును అందచేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము సమస్యను తెలిపిన వెంటనే తమ స్వంత నిధులు రూ.50వేలు అందచేసి తమ మంచినీటి సమస్యను తీర్చిన ఎంఎల్ఎకు గ్రామస్తులు, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రాచాల శ్రీనివాసయాదవ్, కాసిరెడ్డి, సుబ్బారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మోహనరెడ్డి, తదితరులున్నారు.

## త్వరలో విఎస్ఎస్లలో కలప సేకరణ

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

జిల్లాలో 761 విఎస్ఎస్లలో త్వరలో కలప కొట్టి సేకరించినున్నట్లు ప్రాథమిక అంచనాల మేరకు 1.75 లక్షల టన్నుల వస్తుందని అంచనా వేస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆత్మకూరు రేంజ్ కార్యాలయం ఆవరణంలో రేంజ్ ఆఫీసర్ రామకొండారెడ్డి అధ్యక్షతన డిఆర్ఒ పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వనసంరక్షణ సమితి నిర్వాహకులతో అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎఫ్ఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2013 చివరిసారిగా కలప సేకరణ జరిగిందని అనంతరం ఇప్పుడు జరగనున్నన్నారు. అప్పట్లో హెక్టారుకు 2222 మొక్కలు చొప్పున నాటినట్లు వాటిని విఎస్ఎస్ సభ్యులు కాపాడి పెంచి పెద్ద చేసినట్లు ఆయన తెలిపారు. తమ శాఖ తరపున 67 ప్లాంటేషన్లు విఎస్ఎస్ తరపున 761 ప్లాంటేషన్లు జిల్లాలో ఉన్నాయని ఒక్కోటన్ను కలప రూ.3460 వంతున కొట్టుకునేందుకు కాంట్రాక్టర్లు ఒప్పుకున్నారని తెలిపారు. రేంజ్ ఆఫీసర్ రామ కొండారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ డిఎఫ్ఒ (కావలి) రాజశేఖర్ బాబు, డిఆర్ఒలు ఖాజా రహంతుల్లా (అనంతసాగర్), నరసింహారావు (కేవన్ పల్లి), గౌడ్ (కిష్టాపురం), రవీంద్ర (మర్రిపాడు), పిచ్చిరెడ్డి (ఆత్మకూరు) వారి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డిఆర్ కాలనీలో సిఒసి సర్వే

**ప్రజాశక్తి-అల్లూరు :** మండల కేంద్రంలోని ఆర్డిఆర్ కాలనీలో శుక్రవారం సిఒసి సర్వే కార్యక్రమాన్ని చేపట్టగా ఎంపిడిఒ శ్రీదేవి పాల్గొని ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు సచివాలయ సిబ్బందితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారో ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్త పరిచినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి పెంచల వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ తదితరులున్నారు.

# పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మాజీఎంపితో మాట్లాడుతున్న రైతు నాయకులు

ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతు సంఘ నాయకులు కాకు వెంకటయ్య మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డికి విన్నవించారు. శుక్రవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆయన స్వగ్రామంలో కలిసి పసుపు రైతులతో ఆయన కలిసి పసుపు కొనుగోలు కేంద్రమును వెంటనే ఏర్పాటు చేసి పసుపును ప్రభుత్వం నేరుగా క్వింటా రూ.10వేల చొప్పున కొనుగోలు చేసి పసుపు రైతుల ఆదుకోవాలన్నారు. అలాగే ప్రతి పసుపు రైతుకు బీమాను వర్తించేటట్లుగా చేసి బీమా ప్రతి రైతుకు వచ్చేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపి రాజమోహన్ రెడ్డి, ఎపి వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి పసుపు రైతులకు ఉదయగిరిలో వెంటనే కొనుగోలు ఏర్పాటు చేసి ప్రతి రైతుకు బీమా వర్తించేటట్లు చూడాలని కోరగా వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తానని మంత్రి చెప్పడంతో వారికి రైతులు కృతజ్ఞతలు తెలిపి వెనుదిరిగారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పసుపు రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరీ బాధ్యత

**ప్రజాశక్తి-నెల్లూరు**

సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రామ/వార్డు సచివాలయ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో "పర్యావరణహిత జీవనశైలి" పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీని శుక్రవారం ఉదయం నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ కూడలి నుంచి సైకిల్ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ ఏ.సీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం వరకు సైక్లింగ్ చేసిన అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనందరి దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్, సాధ్యమయినంతవరకు ప్రజా రవాణా వాడటం, ఎలివేటర్ బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పుకోసం ప్రయత్నించాలని కమిషనర్ కోరారు. పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో నెల్లూరు నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, స్త్రీ స్వశక్తి సంఘాల సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

**ప్రజాశక్తి-సీతారామపురం**

మాట్లాడుతున్న ఆర్డిఒ కరుణకుమారి

బెంగుళూరు నుండి అమరావతికి వెళ్లే గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు అందించే నష్టపరిహార జాబితా పారదర్శకంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డిఒ కరుణకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి రైతులు ప్రజలతో నుండి వివరాలు సేకరించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే సీతారామపురం మండలం మీదుగా వెళుతున్న సందర్భంగా భూములు ఆస్తులు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉండి నష్టపరహారం అందిస్తుందని వీలైనంత గరిష్ట స్థాయిలో నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా ఎంపిక వారికి అందించాల్సిన నష్టపరిహార అంచనాలో తారతమ్యాలు ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపణలు చేయడంతో ఆమె స్థానిక రెవెన్యూ సిబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షాజియా బేగం, హౌసింగ్ ఎఇ రామకృష్ణ, సర్పంచ్ ఆదెయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులున్నారు.

## వ్యాధుల నివారణపై అప్రమత్తం

**ప్రజాశక్తి-అల్లూరు**

వ్యాధుల నివారణకు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లో సంఘం గ్రామంలో ఫ్రైడే - డ్రైడే సందర్భంగా గిరిజనులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు అలాగే పాత టైర్లు ఇళ్ల మధ్యన మురుగు లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. తద్వారా లార్వా ఉత్పత్తి కావడం వల్ల అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రమీల, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నిరంతర విద్యకు దోహదం

**ప్రజాశక్తి-కొడవలూరు**

ఉన్నత పాఠశాల గండవరం విద్యార్థుల సమ్మర్ యాక్టివిటీస్ నోట్ బుక్‌లను పరిశీలన చేసినట్లు హిందీ ఉపాధ్యాయులు గుంజి నాగభూషణం తెలిపారు. విద్యార్థులకు వేసవి సెలవులలోనూ అభ్యసనం కుంటుపడకూడదని రాష్ట్ర విద్యాశాఖ సమ్మర్ యాక్టివిటీస్ అనే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని ప్రతి తరగతికి వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి దానిలో విద్యార్థులను ఉపాధ్యాయులను చేర్చమని ఆదేశించారు. ప్రతి విద్యార్థి ఒక నోట్సుపెట్టి ఉపాధ్యాయులు పంపే విషయాలను అందులో నోట్ చేసుకోవాలని సూచించారు. జూన్ 12న పాఠశాల ప్రారంభం రోజున అందరి నోట్సులను చూడాలని విద్యాశాఖ ఆదేశించిందన్నారు. అందులో భాగంగా 8వ తరగతి క్లాస్ టీచరైన హిందీ ఉపాధ్యాయులు గుంజి నాగభూషణం విద్యార్థులు సమ్మర్ యాక్టివిటీస్ ఎలా చేస్తున్నారో పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రహంతున్నీసా, విద్యార్థినులు హబీబున్నీసా, సుమాంజలి, గౌస్ షరీఫ్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడి మహేశ్వరరావు

## పాడిపరిశ్రమపై మహిళలకు అవగాహన

**ప్రజాశక్తి-బిట్రగుంట**

మహిళలకు పాడి పరిశ్రమ జీవన ఉపాధిపై అవగాహన కార్యక్రమాన్ని ఎడి మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని జువ్వలదిన్నె గ్రామంలో శుక్రవారం మహిళల పాడి పరిశ్రమ సేవ్ చిల్డ్రన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి.గౌతమ్ మాట్లాడుతూ గేదెల పెంపకంపై వాటికి అనుగుణంగా ఉండాల్సిన వాతావరణాన్ని ఉండేలా చూసుకోవాలని వాటికి కావాల్సిన దానా, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విజేత డెయిరీ మేనేజర్ పి.ఆనంద్ మాట్లాడుతూ పాలు, వెన్న శాతంలో పెరగవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గేదెలు చనిపోతే ప్రభుత్వం రూ.30 వేల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కే.శ్రీనివాసులు, నెల్లూరు సేవ్ ద చిల్డ్రన్స్ సూపర్వైజర్ ఎంవి రమణయ్య, గ్రామ సర్పంచ్ గోవిందస్వామి, ఎంపిటిసి వై.కొండయ్య, కవిత, ప్రసన్న, రాజు, మధు భరత్, బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ బదిలీలను ఆపాలి : ఎస్డబ్ల్యూఎఫ్

**ప్రజాశక్తి-ఉదయగిరి**

డిడిఒ డిపో స్ట్రాంగ్ పేరుతో అక్రమ బదిలీలను వెంటనే ఆపాలని ఉదయగిరి ఎస్ డబ్ల్యు ఎఫ్ మండల కమిటీ నిరసన తెలిపారు. శుక్రవారం స్థానిక డిపో మెయిన్ గేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్డబ్ల్యూఎఫ్ డిపో సెక్రటరీ ఎస్.రవి, డిపో ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమ బదిలీలను వెంటనే ఆపాలని డిమాండ్ చేసి నిరసన తెలిపామన్నారు. ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డిఎలు, అరియర్స్ వెంటనే చెల్లించి నూతన హైయర్ బస్సులను తీసుకొనకుండా, ఆర్టిసి సంస్థ కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పే అరియర్స్‌ను తక్షణమే ఇచ్చి అప్పులలో ఉన్న ఆర్టిసి నుండి స్టేట్ గవర్నమెంట్ 25 శాతం డబ్బులు తీసుకోవడం వల్ల సంస్థకు నష్టం వస్తుందని దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. కార్య క్రమంలో కమిటీ సభ్యులు సుదర్శన్, కార్మికులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కావలి**

పెండింగ్‌లో ఉన్న ఆర్.టి.సి. కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ, ఎస్డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి డిపో ఎదుట ధర్నా, గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.డబ్ల్యూ.ఎఫ్. కోశాధికారి సిహెచ్.వెంకటేశ్వర్లు, నాయకులు మధు, బేగ్, తదితరులు మాట్లాడుతూ ఆర్.టి.సి. బస్టాండ్ల ప్రైవేటీకరణను ఆపివేయాలన్నారు. అద్దె బస్సులు తగ్గించాలన్నారు. 2/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఎస్డబ్ల్యూఎఫ్ నాయకులు డి.ఆర్. రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రెండు గడ్డివాములు దగ్ధం

**ప్రజాశక్తి-బిట్రగుంట**

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 2 గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. రామస్వామిపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు రత్తయ్య పశువుల మేత నిమిత్తం గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నాడు. మధ్యాహ్నం ప్రమాదం శాత్తు గడ్డివాములు తగలబడుతుండటంతో స్థానికులు రైతుకు సమాచారం అందించారు. స్థానికులు గడ్డి వాములను ఆర్పేందుకు ప్రయత్నాలు చేశారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో పక్కనే ఉన్న ఇతర గడ్డివాములకు మంటలు వ్యాప్తి చెందకుండా నియంత్రించారు.

## వలంటీర్ వ్యవస్థ అభినందనీయం

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ప్రభుత్వ పథకాలను సచివాలయాల ద్వారా గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరికీ వాలంటరీ వ్యవస్థతో అందించడం అభినందనీయమని జెడ్పిటిసి మోడీ రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బిట్-1 సచివాలయం, బండగాని పల్లి సచివాలయంలో సర్పంచులు సామ్రాజ్యం, లక్కు రవణమ్మ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న జెడ్పిటిసి మోడీ రామాంజనేయులు జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ మాట్లాడుతూ సచివాలయాలతో ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో వలంటీర్ల పనితీరు బాగుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, ఎంపిటిసి పెద్ద మస్తానీ, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఎస్దాని, కోఆప్షన్ సభ్యులు సుభాని పంచాయతీ ఇఒ నరసయ్య, కార్యదర్శి చిన్నబాబు నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసులు, లక్కు రవి పాల్గొన్నారు.

### వలంటీర్ల సేవలు అభినందనీయం

ఉదయగిరిలో మాట్లాడుతున్న మోడీ రామాంజనేయులు

**ప్రజాశక్తి-సీతారామపురం**

రాష్ట్రంలోని వైసిపి పారదర్శక పాలనలో గ్రామ, వార్డు వలంటీర్ల పాత్ర అద్భుతమని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరు రాజు, సర్పంచి కె.భాగ్య కుమారి పేర్కొన్నారు. సీతారామపురం బిట్-1, బిట్-2 సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరురాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను అందజేయడంలో ప్రభుత్వానికి ప్రజలకు ఒక వారధిలా వలంటీర్లు పని చేస్తున్నారని, అలాగే వలంటీర్లు అందరూ బాగా కష్టపడి జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు హైదర్ వలీ, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## 'ఎన్డిఆర్ఎఫ్' మాస్టర్ డ్రిల్

**ప్రజాశక్తి-బిట్రగుంట**

విజయవాడ డివిజన్ రైల్వే పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్ సిఎన్డబ్ల్యూ కార్యాలయం వద్ద శుక్రవారం ఎన్డిఆర్ఎఫ్ పదవ వార్షికోత్సవ మాస్టర్‌డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్డిఆర్ఎఫ్ అధికారి రాబిన్ కుమార్, సుధీర్ కుమార్, విజయవాడ అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు. రైల్వే ట్రైన్లలో జరిగే ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఎన్డిఆర్ఎఫ్ బృందాలు విన్యాసాలు చేసి చూపించారు. కార్యక్రమంలో విజయవాడ డిఎస్ఒ జె.శ్రీకాంత్, పివి రమణ రాయి, ఎం.రవి కిరణ్, మనోజ్ కుమార్, బిట్రగుంట స్టేషన్ సూపరింటెండెంట్, బిట్రగుంట రైల్వే అన్ని విభాగాల సిబ్బంది రైల్వే అధికారులు ప్రజలు తదితరులున్నారు.

**CHANGE OF NAME**

I, SARABU VENKATA NAGASIVA-SAIKRISHNAVISWATH S/o SARABU SUNEEL KUMAR (Old Name)bearing Passport No. J2837240 resident of D.No.6-3-67,Singaraju Vari Veedhi, Opp.Water Tank,Pappula Street, Stonehousepet, Nellore,SPSR Nellore Dt.(A.P) do hereby change my name to **SARABU VENKATA BHARATH VISWATH S/o SARABU VENKATA SUNIL KUMAR** (New Name).

**IndusInd Bank - CFD**
**COMMERCIAL VEHICLES FOR SALE**
1) APE XTRA LDX PU BS VI 2021 MODEL AP39 TY 9710
2) APE AUTO DX BS VI 2021 MODEL AP39 TY 6171
3) APE XTRA ID BS IV 2019 MODEL AP39 TE 3225
**Cell : 99594 46238**
D.No. 16/1007, 2nd Floor, Subba Reddy Shoping Complex, Beside Hotel Mayuri, Pogathota, NELLORE.

**CHANGE OF NAME**

I, SARABU VENKATA LAKSHMIMANWITHA SREEYA D/o SARABU SUNEEL KUMAR (Old Name) bearing Passport No. J2837223 resident of D.No.6-3-67, Singaraju Vari Veedhi, Opp.Water Tank,Pappula Street, Stonehousepet, Nellore, SPSR Nellore Dt.(A.P) do hereby change my name to **SARABU VENKATA LAKSHMI MANVITHA SHRIYA D/o SARABU VENKATA SUNIL KUMAR** (New Name).

**CHANGE OF NAME**

I, KAKU RAJASEKHARAM (Old Name) son of KAKU RAGHAVAIAH residing at Sivalayam Street, RUDRAKOTA Village, Kavali Mandal, SPSR Nellore Dist. A.P. hereby declare that I have changed my name as
**KAKU RAJASEKHAR**
(New Name)
hereafter call all purpose in future.